కలిసిన పట్టాలు

వి. కామేశ్వరి

అర్థరాత్రి రెండుగంటలయింది. విశాఖపట్నంనుండి బయలుదేరిన జనతా ఆగకుండా పరుగెడుతూవుంది. తనతో సమాంతరంగా పరుగులు తీస్తున్న చెట్లని, టెలిగ్రాఫ్ స్తంభాలను చూస్తూ కిటికీ దగ్గరగా కూర్చున్నాడు ఆ అబ్బాయి. ఏమిటో చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. మధ్య మధ్య తనలో తనే ముసిముసిగా నవ్వుకుంటున్నాడు. బహుశా తను చూడబోయే, అనుకూలమయితే తనకు కాబోయే వధువు జ్ఞాపకంవచ్చినట్లుంది. ఆ అబ్బాయి ఆలోచనకి అంతరాయం కలిగింది.

ఒక అమ్మాయి ఆ పెట్టెలోకే ఎక్కింది కాబోలు, ఎక్కడా చోటుదొరక్క అబ్బాయి సీటు దగ్గరకి వచ్చింది. అక్కడ కూడ జనం బాగానే వున్నారు. అమ్మాయి అలాగే నిల్చుంది. ఎవరన్నా పిలిచి చోటు చూపిస్తారేమోనని. నిల్చున్న అమ్మాయి చాలా బాగుంది.

లేత వైలెట్ సిల్కుచీర, ఒంటికి పట్టిన తెల్ల క్రేప్‌జాకెట్టు అమ్మాయి నాజూకుతనాన్ని చూపిస్తున్నాయి. మెళ్ళో వేసుకున్న తెల్లరాళ్ల మామిడిపిందెల నెక్లెసు వుండివుండి నక్షత్రంలా మెరుస్తూంది. చేతిలో ప్లాస్టిక్ బాగ్. వాచ్. వాలకమంతా చదువుకున్న దానిలావుంది. ఎంత బాగుంది... చూడకూడదనుకున్ని చటుక్కున చూశాడు అబ్బాయి. అమ్మాయికూడా చూచింది. ఉక్కిరిబిక్కిరయ్యాడు...పాపం!

ఇక అబ్బాయి. తెల్లపాంటు, తెల్ల బుష్ కోటు వేసుకున్నాడు. కాళ్ళకి బూట్సున్నాయి — కళ్ళకి జోడుమాత్రం లేదు.

వేషం చూస్తే బాగా చదువుకున్నవాడిలా మర్యాదస్తుడులా కన్పించాడు. అమ్మాయి మనస్సులోని ఉద్దేశం తెలుసుకున్నాడు కాబోలు, కొంచెం ప్రక్కకి జరిగి—

'అభ్యంతరం లేకపోతే యిక్కడ కూర్చోవచ్చు' అన్నాడు మెల్లిగా. ఆ మాటకోసం ఎదురుచూసిన అమ్మాయి మాట్లాడకుండా ఒదిగి కూర్చుంది. ఇద్దరికి మధ్య ఎందుకయినా మంచిదని తన బాగ్ అడ్డంపెట్టాడు అబ్బాయి. అతని ఆటగోడుతనానికి నవ్వుకుంది. ఎవరూ మాట్లాడడంలేదు.

పావుగంట గడిచింది. మంచివాడనుకున్న అబ్బాయి కొంటెగా ప్రక్కచూపులు ప్రారంభించాడు. మొదట్లో తను చలించలేదు. నిముషాలు గడిచినా చూపులు మారటంలేదు. అబ్బాయిమీద కోపం వచ్చింది. "ఎందుకలా చూస్తాడు? తనకి ఎవరయినా చూస్తుంటే చచ్చేటంత సిగ్గు. అందులోనూ చెట్టంత మనిషి, నలుగురిలోనూ రెప్పార్పకుండా, గ్రుడ్లు తిప్పకుండా అదే పనిగా చూడడం ప్రారంభిస్తే, ఏం చెయ్యాలి? చుట్టూకూర్చున్న ప్రయాణీకులు ఏమనుకుంటారు. ఒకరు చూస్తారన్న భయమేలేదు కాబోలు" అనుకుంది అమ్మాయి. అబ్బాయి చూపులు తప్పించుకుందుకు హేండ్ బాక్ అడ్డం పెట్టుకుంది. సన్నగా నవ్వుకున్నాడు.

'ఎందుకంత సిగ్గు, చదువుకున్న అమ్మాయికి సిగ్గు సహజమా? ప్రబంధనాయకిలా సిగ్గుపడుతూంది. వంటరిగా ఎక్కడనుంచి వస్తోందో! ఎంత బాగుంది ఆ అమ్మాయి. అమ్మాయికన్న అందంగా వున్నాయి ఆమె కళ్లు, ఆడపిల్లల అందం అంతా కళ్లలోనే వుందంటాడు కవి. బాగా కనిపెట్టినట్లున్నాడు. కళ్ళు బాగానే అందంగా వున్నాయిగా. యింకా ఎందుకలా అడ్డుపెట్టుకుంది. అందమైన తన కళ్ళు ఎవరూ చూచి ఆనందించకూడదు కాబోలు. తను కలుసుకోబోయే వధువుపరీక్ష ముందిలా కళ్లలోనే చెయ్యాలి' అనుకున్నాడు.

"నాన్నగారు స్టేషనుకి వస్తే బాగుండును. అర్ధరాత్రి వేళ యింటికి ఒంటరిగా వెళ్ళడం బాగుండదు" అనుకుంది.

"పిల్లవాడు బుద్ధిమంతుడు, డాక్టరువృత్తి చేస్తున్నాడు. ఒడ్డూ పొడుగూ వున్నాడు, అందంగా వున్నాడు, కట్నం కానుకలతో నిమిత్తం లేదు. రేపు రాత్రికి వస్తున్నాడు కాబట్టి నువ్వుకూడా వస్తే బాగుంటుంది." అని తండ్రి వ్రాసిన ఉత్తరం అందుకుని బయలుదేరింది తను. పిల్లవాడు విశాఖనుండి వస్తాడని తెలుసు. మరి యీ అబ్బాయో! అక్కడనుండే లాగుంది రావటం. దూరప్రయాణం చేసి వస్తున్నవాడులా వున్నాడు. డాక్టరు కాదేమో! ఎవరని అడగడం? జేబులో థర్మామీటర్ గాని మెళ్ళో

పూవు మీ అదృష్టం చెప్పగలదు



మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదీన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

చెవిటి వా లోకం

చెవిటివాడు: ఎందుకలా అరుస్తారు! నాకేం చెముడనుకొన్నారా?

ఒకడు: అబ్బే! నేనిప్పుడు అరవలేదు. ఆవలించాను. అంతే!

* * *

భార్య: నా ముక్కుపుడక కాస్తా ఎక్కడో పోయిందండీ.

చెవిటి భర్త: అసలు నా ముక్కుపొడిడబ్బాతో నీకేమి పనొచ్చింది?

ఎల్. వెంకటేశ్వర్లు.

స్తెతస్కోప్ గాని లేదు. అతను డాక్టరని ఎలా అనుకోవడం. ఆ అబ్బాయి ఎవరో? నాన్నగారు వ్రాసిన డాక్టరు, యీ అబ్బాయి అయితే ఎంత బాగుండును! అని అనుకుంది అమ్మాయి. సిగ్గుతో కళ్ళు కిలకిలా నవ్వాయి.

"ఆ అమ్మాయి రాజమండ్రిలో బి. ఎ. చదువుతూ వుంది. మనిషి సన్నగా, పొడుగ్గా, అందంగా వుంటుందిట. బాగా పాడుతుందట కూడాను. ఇంతవరకు ఒక్క మాటగూడా వినిపించలేదు పోనీ మాటను బట్టి పాటను వూహించవచ్చుననుకుంటే. శాస్త్రి అన్న పిల్ల యీమే అనుకుందికి ఆస్కారం లేదు, ఒక్కటి తప్ప. ఏమంటే యీ అమ్మాయి కూడ రాజమండ్రిలోనే ఎక్కింది. కాబట్టి, అక్కడే చదువుతూంది. కాని యీ అమ్మాయే పెళ్ళికూతురని ఎలా అనుకోవడం. చూపులకోసమని తను ఏలూరు వెళుతున్నాడు. తీరా చూస్తే ఎలా వుంటుందో! యీ అమ్మాయిలా వుంటే ఏదో ఫరవాలేదు. తనేఅయితే అంతకన్నా అదృష్టం వేరేముంటుంది. ఏమయినా వాళ్ళు వీళ్ళెందుకవుతారు! తన పిచ్చి కాని! అంతదాకా వస్తే ఆ పిల్ల తను అనుకున్నది కానిపక్షంలో నచ్చలేదని నిరాకరించవచ్చు! నిర్ధారణ చేసుకున్నాడు. అబ్బాయి తెగించి మళ్ళీ చూశాడు అమ్మాయిని. జేర్ చేసి బాగ్ సందులోంచి చూచింది అబ్బాయిని. స్టేషను వచ్చిందికాబోలు రైలుకి బ్రేకుపడింది. ఏలూర్...ఏలూర్ అరుపులు వినబడ్డాయి. ఇద్దరూ లేచి నిలబడ్డారు. "పెళ్ళయిందా!" ఎదురుగా కూర్చుని అంతసేపూ కునికిపాట్లు పడుతున్న ముసలమ్మ హఠాత్తుగా అడిగింది. 'ఊ! హూ!' సిగ్గుతో తల వూపింది. అబ్బాయికి కావలసిన యిన్ఫర్మేషన్ దొరికింది. ముసలమ్మకి మనస్సులోనే థాంక్స్ చెప్పుకున్నాడు. ఒకరివెనుక ఒకరు దిగడం జరిగింది.

'అమ్మా! శ్యామా!...' ప్లాటుఫారం మీద నుండి ఎవరో పిలిచారు.

'వస్తున్నా నాన్నగారూ! ఇక్కడ వున్నాను.' పెట్టెలోనుండి చెయ్యి చూపించింది అమ్మాయి. సామాను దింపుకుంటున్న అబ్బాయి, అమ్మాయి పెట్టెకూడా దింపి క్రిందపెట్టాడు. అతని పరధ్యానానికి నవ్వుకుంది శ్యామ.

'ఆ పెట్టె నాది ... యివ్వండి ...' ముద్దుగా అడిగింది. ఆమె మాటలకోసం చెవులు నిగిడించుకున్న అబ్బాయి చాలా సంతోషించి 'నే దింపుతా...పదండి.' అన్నాడు కలిగిన అవకాశం జారవిడుచుకోకుండా. శ్యామ మెల్లిగా ఒకొక్కరినే తప్పించుకుని తలుపుదగ్గరికి వచ్చింది.

'జాగ్రత్తగా వచ్చావా?' అడిగారు ముసిలాయన.

'వచ్చా నాన్నగారు...' సిగ్గుపడుతూ అబ్బాయిచేతిలో పెట్టె అందుకుంది శ్యామ. మిగిలిన సామాను జేరవేస్తున్న అబ్బాయికి వెనుకనుండి పిలుపు వినబడింది.

'హల్లో! శాస్త్రీ! వచ్చావేం? రావనుకున్నా!' పలకరించాడు అబ్బాయి. శాస్త్రి మాడినట్లు నటించాడు.

'ఇలా వచ్చారేం పంతులుగారూ!' అప్పుడే వెళ్ళబోతున్న శ్యామతండ్రిని భుజం పట్టుకుని పలకరించాడు శాస్త్రి. ఉలిక్కిపడ్డారు పంతులుగారు.

'ఓ! శాస్త్రి! నువ్వా వచ్చావేం?' ఎదురుప్రశ్న వేశారు. 'మావాడు వచ్చాడు. మీకు చెప్పానుగా. అందుకని.' నవ్వాడు. శ్యామవైపు ప్రశ్నార్థకంగా చూశాడు! సామానుతోసహా క్రిందకి వచ్చాడు అబ్బాయి.

'మా అమ్మాయి. శ్యామ, యిప్పుడే దిగింది.' పరిచయంచేశారు. తనలో తనే నవ్వుకున్నాడు శాస్త్రి.

"మా ఫ్రెండు రమేశ్. విశాఖలో డాక్టర్." రైలుదిగిన అబ్బాయిని శ్యామకి, తండ్రికి పరిచయంచేశాడు శాస్త్రి. శ్యామ ఉక్కిరి బిక్కిరి అయింది. అబ్బాయి చలించలేదు.

"చాలా సంతోషం. మా అమ్మాయి యిది. శ్యామ. రాజమండ్రిలో చదువుతూ వుంది మీకీ పాటికి తెలిసే వుంటుంది." అన్నారు ఛలోక్తిగా ముసిలాయన. ఆడబోయిన తీర్థం ఎదురయింది అబ్బాయికి.

'బాగా తెలిసింది.' చిరునవ్వు నవ్వాడు.

"స్టేషను వచ్చేసింది. కలియవలసిన పట్టాలు ఎప్పుడో కలిసిపోయాయి. ఇక ముహూర్తం పెట్టడమేనా తరువాయి." అడిగాడు శాస్త్రి. అందరూ నవ్వుకున్నారు.

'ఇంటికి వెళ్ళి తీరికగా మాట్లాడుకోవచ్చు. ఇక పోదాం!' పంతులుగారు అన్నారు.

'ఏంరా బ్రదర్. చూసింది చాలునా లేక పెళ్ళిచూపులని వేరే ఏర్పాటు చేయించాలా!' గమ్మత్తుగా అడిగాడు శాస్త్రి. రమేశ్ చిరునవ్వుతో బాగుందన్నట్లు చూశాడు శ్యామవైపు. కాబోయే పెళ్ళికూతురికి సిగ్గేసి, అంతవరకు కలిసిలేని పట్టాలవైపు దృష్టి మరల్చింది. ★

మానవ నైజం

[శెట్టిపల్లి రామకోటీశ్వరరావు]

తల్లిదండ్రులకన్న
ఆప్తమిత్రులకన్న
చదువుసంధ్యలకన్న
జవరాలి జడలోని
జాజిపూవులు మిన్న.

* * *

కవనరచనముకన్న
కావ్య పఠనముకన్న
దరిజేరనున్న
ధనరాసికన్న
ప్రియురాలి తలలోని
ప్రక్క పిన్నులు మిన్న.

* * *

కన్నవారికి పేరు తెచ్చుటకన్న
ఉన్న ఊరిని పేరునొందుటకన్న
దేశసేవకు దేహమిచ్చుటకన్న
ప్రేయసీ ప్రేమలో గడుపుటే
మిన్న.